# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-11-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లా పట్టపర్తిలో పర్యటించనున్నారు.**

2. **వచ్చే మూడేళ్ల కాలంలో 17 లక్షల ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **దేశానికి విదేశీ మారక ద్రవ్యం అధిక శాతం చేపల ఎగుమతులు ద్వారా లభిస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**

4. **వచ్చే దశాబ్ధ కాలంలో దేశీయ మీడియా, వినోద రంగం 31 బిలియన్ డాలర్ల మేరకు వృద్ధి చెందుతుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు.**

5. **తెలంగాణను గ్లోబల్ గ్రోత్ ఇంజిన్‌గా మార్చడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.**

==========================

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లా పట్టపర్తిలో పర్యటించనున్నారు. శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో ఆమె పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు అధికారులు వెల్లడించారు. సాయంత్రం శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయం 44వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని విద్యార్థులకు డాక్టరేట్లు ప్రదానం చేయనున్నారని తెలిపారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికారులు అవసరమైన ఏర్పాట్లను చేశారు.

--------------------------

వచ్చే మూడేళ్ల కాలంలో 17 లక్షల ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గృహనిర్మాణశాఖపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వచ్చే ఉగాది నాటికి 5లక్షల ఇళ్ళకు సామూహిక గృహ ప్రవేశాలు జరగాలని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అందరికీ ఇళ్లు అనే కార్యక్రమాన్ని ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి ఉద్యోగులందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు.

---------------------------

దేశానికి విదేశీ మారక ద్రవ్యం అధిక శాతం చేపలు ఎగుమతులు ద్వారా లభిస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురంలో ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా భూపతిరాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ.. భావితరాలకు మత్స్య సంపదను అందించడమే కాకుండా ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వారికి సుస్థిరమైన ఆర్థిక భరోసాను కల్పించడమే మత్స్య దినోత్సవం లక్ష్యమన్నారు.

---------------------------

వచ్చే దశాబ్ద కాలంలో దేశీయ మీడియా, వినోద రంగం 31 బిలియన్ డాలర్ల మేరకు వృద్ధి చెందుతుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు. గోవాలోని పనాజీలో జరుగుతున్న 56వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో కో-ప్రొడక్షన్ అంశంపై నిన్న నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అందుబాటులోకి వచ్చిన సాంకేతికత సాయంతో పైరసీ నిర్మూలనపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో అంతర్జాతీయ చలనచిత్ర కో-పొడక్షన్ ను విస్తరించడం, భారతీయ సినిమాలను ప్రోత్సహించడం తదితర అంశాలపై చర్చించారు.

---------------------------

తెలంగాణను గ్లోబల్ గ్రోత్ ఇంజిన్‌గా మార్చడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. జలవర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం లక్షలాది మంది ఇంజనీర్లను సమాజానికి అందించిందన్నారు. హైదరబాదులో జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం – జెఎన్టీయు వజ్రోత్సవ వేడుకలు నిన్ననిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ప్రముఖ కర్నాటక సంగీత విధ్వాంసులు, పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ వర్ధంతి ఈరోజు. ప్రపంచ వ్యాప్తంగా 25 వేల సంగీత కచేరీలను నిర్వహించిన ఘనత బాలమురళికి దక్కింది. 72 మేళకర్త రాగాల్లో రచనలు చేసి సంగాతాభిమానుల మన్ననలు పొందారు. తిల్లానా గానం చేయడంలో ప్రసిద్ధి పొందారు. ఆకాశవాణిలో నిలయ విధ్వాంసులుగా చిరకాలం ఆయన సేవలు అందించారు. చలన చిత్రాల్లో ఆయన గానం చేసిన పాటలు సైతం విశేష ప్రజాదరణ పొందాయి. భక్త రామదాసు కీర్తనల ప్రచారానికి విశేష కృషి చేసిన మంగళంపల్లి బాలమురళీకృష్ణ 2016 నవంబర్ 22న తుది శ్వాస విడిచారు. ఆయన గళాన్ని ఒకసారి విందాం ...

వాయిస్ 25 సెకన్లు

---------------------------

అరటి పంట ధరలు పతనం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖలపై సమీక్షా సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

అరటిని పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా–సిసిఐ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ముఖ్యమంత్రి అగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కేంద్రానికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

దక్షిణ ఆఫ్రికా, భారత్ జట్ల మధ్య రెండవ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ ఈరోజు నుంచి ప్రారంభం కానుంది. అస్సాంలోని గౌహతి పట్టణంలో ఉన్న బర్సాపరా స్టేడియంలో ఈ ఉదయం 9 గంటల నుంచి ఈ మ్యాచ్ జరుగనుంది. తొలి టెస్ట్‌లో భారత జట్టు ఓటమి పాలైంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

మలక్కా జలసంధి మధ్య భాగాలపై ఉపరితల ఆవర్తనము, సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి, అదేవిధంగా కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఈరోజు దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు. తరువాత, ఇది పశ్చిమ–వాయువ్య దిశగా కదిలి, ఈ నెల 24 నాటికి దక్షిణ బంగాళా ఖాతంలో వాయు గుండంగా మారే అవకాశం ఉందని తెలియజేస్తూ..

వాయిస్.. సెకన్లు

ఆంధ్రప్రదేశ్‌లో అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో చలి తీవ్రత కొంత తగ్గిందని అధికారులు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత 13 డిగ్రీలుగా నమోదయ్యిందన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ఈరోజు, రేపు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే 2 రోజులు రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు అక్కడక్కడా సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు వరకూ తగ్గడంతో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

---------------------------

ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, విద్య శాఖ అధికారులతో గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అనుమతుల్లేకుండా నడిచే ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి స్వదేశంతో పాటు విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలన్న ఆసక్తి గల విద్యార్థినులకు ‘కలలకు రెక్కలు’ పథకం కింద సాయం అందిస్తామని చెప్పారు.

=====================